క్లుప్తంగా

ఘనంగా విఖనస ముని జయంతి


ప్రత్యేక అలంకరణలో విఖనస ముని

పెదపూడి: సంపర గ్రామంలో వైఖానస ఆగమ సష్టికర్త విఖనస ముని జయంతిని శ్రావణ పౌర్ణమి శనివారం ఘనంగా నిర్వహించారు. పండితుడు ఖండవల్లి హనుమంతాచార్యులు ఆధ్వర్యంలో ఆ మునికి ప్రత్యేక పూజలు చేశారు. పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హనుమంతాచార్యులు మాట్లాడుతూ తిరుపతిలో ప్రతి రోజు జరిగే పూజా కార్యక్రమాలన్నీ వైఖానస ఆగమం ప్రకారమే జరుగుతాయన్నారు. విఖనస ముని ఆలయ పూజ, అర్చన విధానాలు ఏవిధంగా చేయాలో గ్రంథం ద్వారా తెలిపారు. కార్యక్రమంలో పండితులు శ్రీనివాసాచార్యులు, సత్యకృష్ణమాచార్యులు, వేణుగోపాలాచార్యులు, వంశీకృష్ణ, రామకృష్ణ తదితరులు విశేష పూజలు చేశారు.

సోమేశ్వరునికి లక్షపత్రి పూజ

పెదపూడి: గ్రామంలో ప్రాచీనంగా ప్రసిద్ధి చెందిన శ్యామలాంబ సమేత సోమేశ్వరస్వామి వారి ఆలయంలో శనివారం లక్షపత్రి పూజ నిర్వహించారు. ఆలయంలో ఉదయం స్వామి వారికి విశేష పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ప్రసన్న వేంకటేశ్వరునికి పూజలు


బలభద్రపురంలో స్వామికి ప్రత్యేక పూజలు

బిక్కవోలు: బలభద్రపురం గ్రామంలో కొలువై తూర్పు తిరుమలగా ప్రసిద్ధి చెందిన శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ మాసం, వేంకటేశ్వరుని జన్మ నక్షతం శ్రావణ నక్షతం, శనివారం కావడంతో ప్రత్యేక పూజలు జరిగాయి. భారీ సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వేకువజామును నుంచే అభిషేకాలు, పూజలు, సుప్రభాతం సేవ నిర్వహించారు. ఆలయ ప్రాంగణం గోవిందా నామస్మరణతో మార్మోగాయి. అనంతరం ఆలయం కమిటీ సభ్యులు భక్తులు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. అలాగే కొంకుదురు, పందలపాక, బిక్కవోలు, కొమరిపాలెం తదితరుల గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులుతో కిటకిటలాడాయి.

ముగిసిన ఏకాహం

రంగంపేట: మండలంలోని రెండు గ్రామాల్లో ఏకాహం ఘనంగా ముగిశాయి. శనివారం పాత దొడ్డిగుంట గ్రామంలోని లక్ష్మీదేవి ఆలయంలోనూ, సింగంపల్లి గ్రామంలోని దుర్గమ్మ తల్లి ఆలయంలోనూ శుక్రవారం ఉదయం నుంచి మొదలైన ఏకాహం భజనలు శనివారం ఉదయంతో ముగిశాయి. సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. నల్లమిల్లి గ్రామంలోని లలితా దేవి వారాహిమాత ఆలయంలో సహస్రనామాలతో అమ్మవారికి ప్రత్యేక సామూహిక పూజలు, భజనలు చేశారు.

ఆహారం పంపిణీ


పైనలో వృద్ధులకు ఆహార పొట్లాల పంపిణీ చేస్తున్న సుధాకర్

పెదపూడి: వృద్ధులు, దివ్యాంగులను ఆదుకోడానికి దాతలు ముందుకు వచ్చి వారి దాతృత్వం చాటుకోవాలని పైన, చింతపల్లి గ్రామాల ఎంపీటీసీ సభ్యుడు సుందరపల్లి సుధాకర్ అన్నారు. పైన గ్రామంలో సత్య హెల్పింగ్ హార్ట్స్ డిజేబుల్ సొసైటీ ఆశ్రమంలో శనివారం వృద్ధులు, దివ్యాంగులు, వికలాంగులు, అనాథ చిన్నారులకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. సుధాకర్ పుట్టిన రోజు సందర్భంగా వీటిని ఏర్పాటు చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాస్టర్ రాయుడు ప్రభుదాసు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఖోఖో, కబడ్డీ జట్ల ఎంపిక

ప్రకాశంనగర్: ఈ నెల 29న జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పది క్రీడా అంశాల పోటీలు, ఎంపిక విధానంలో మొదటి రోజు శనివారం స్థానిక ఎస్‌కేవీటీ క్రీడా మైదానంలో ఖోఖో, కబడ్డీ జట్ల పోటీలు, ఎంపిక నిర్వహించారు. ఈ కార్యక్రమాన్నికి శాప్ డైరెక్టర్ పి.రవీంద్రనాథ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడాల్లోను రాణించాలని అకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి త్రిమూర్తులు, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి స్వామి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్.. ట్రాఫిక్..

- నియోజకవర్గ కేంద్రం రాజానగరంలో నిత్యం ట్రాఫిక్ సమస్య
- పెరుగుతున్న ఆక్రమణలు
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని పోలీసులు


రాజానగరంలోని గాంధీ బొమ్మ సెంటరులో ట్రాఫిక్ జామ్

రాజానగరం: ఆక్రమణలు పెరిగిపోవడంతో మెయిన్ రోడ్డులో ట్రాఫిక్ సమస్య పెరుగుపోతోంది. దీనివల్ల ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. నియోజకవర్గ కేంద్రంగా ఉన్న రాజానగరంలో ట్రాఫిక్ సమస్య ప్రయాణికులను నిత్యం వేధిస్తున్నా పట్టించుకునేవారే లేరు. ఈ సమస్య పరిష్కారంపై చర్యలు తీసుకునే వారే కరువయ్యారు. ట్రాఫిక్ సమస్య కారణంగా గ్రామంలో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందాన ఉంది. అయినా అటు పాలకులకు గానీ, ఇటు అధికారులకు గానీ పట్టడంలేదు అని అనడం కంటే అసలు వారి దృష్టిలోనే లేదని చెప్పవచ్చు.

రోడ్లపైనే వ్యాపారాలు

నియోజకవర్గ కేంద్రంగా ఉన్న రాజానగరంలో సుమారు 10 వేలకు పైగా జనాభా నివశిస్తున్నారు. అంతేకాదు పరిసర గ్రామాల వారికి వ్యాపార, వాణిజ్య తదితర వివిధ రకాల కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు ఇది సెంటర్ పాయింట్‌గా ఉంది. దీనితో గ్రామంలో పూర్వపు జాతీయ రహదారిగా ఉన్న ప్రధాన రోడ్డు నిత్యం రద్దీగానే ఉంటుంది. ఈ కారణంగానే గతంలో ఇక్కడ పని చేసిన పోలీసు అధికారులు తరచూ ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యను దృష్టిలో పెట్టుకుని, ఆక్రమణలకు అడ్డుకట్ట వేస్తూ ప్రధాన రోడ్డుకు ఇరువైపులా ఉన్న మేజర్ సీసీ డ్రైన్లను 'లక్ష్మణ రేఖ'గా నిర్ణయించారు. మేజర్ డ్రైన్లను దాటి వ్యాపారులు ఎవ్వరూ రోడ్డు పైకి రాకూడదంటూ పంచాయతీ అధికారుల ద్వారా అవసరమైన చర్యలు తీసుకున్నారు. ఆ తరువాత అనేక సందర్భాలలో వ్యాపారులు ముందుకు వచ్చినా గానీ పంచాయితీ సిబ్బంది అప్రమత్తంగా ఉండేవారు. అయితే గత కొన్నేళ్లుగా లక్ష్మణరేఖగా ఉన్న మేజర్ సీసీ డ్రైన్లను దాటుకుని మరీ వ్యాపారులు రోడ్డుపైకి తమ వ్యాపారాలను విస్తరిస్తుండడంతో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు పెరుగుతూ, జఠిలమవుతూ వస్తోంది. ముఖ్యంగా గాంధీ బొమ్మ సెంటరు నుంచి అటు అన్నదాన సత్రం, ఇటు బస్టాండ్ సెంటరు వరకు దుకాణాల ముందు వాహనాలు పెట్టుకునే జాగా లేక, ఆయా దుకాణాలకు వచ్చే కస్టమర్లు తమ వాహనాలను రోడ్డు పైనే పార్కు చేస్తున్నారు. మరి కొంతమంది వ్యాపారులు తమ వ్యాపారాలు లోపలికున్నాయంటూ షెడ్లు వేసి మరీ రోడ్డు పైకి వ్యాపారాలను విస్తరించడంతో రోడ్డు ఇరుకుగా మారి ట్రాఫిక్ సమస్యకు కారణమవుతుంది. అంతేకాదు రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు భారీగా పెరిగిపోవడంతో ఈ సమస్య మరింత జఠిలమైంది. ఈ క్రమంలో సంక్రాంతి, దీపావళి, వినాయక చవితి, వరలక్ష్మి వ్రతం వంటి ముఖ్యమైన పండగల రోజులలో క్రయ, విక్రయాలకు వచ్చే వారితో రద్దీ మరింత పెరుగుతోంది. ఇక్కడ ఎప్పుడూ ట్రాఫిక్‌తో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.

కానరాని పోలీసు నియంత్రణ

గాంధీ బొమ్మ సెంటరులో ఈ సమస్య మరీ తీవ్రంగా ఉంటోంది. ఎదురుబొదురుగా వచ్చిన బస్సులు తప్పించేందుకు కూడా చోటు లేకుండా ఉందంటే సమస్య తీవ్రత ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇది నిత్యం ఎదురయ్యే ట్రాఫిక్ సమస్యే అయినా గానీ దానిని నియంత్రించుటలో పోలీసులు కానిపించడంలేదు. గ్రామంలో ఉన్న పోలీసు స్టేషన్‌లో సుమారు 50 మంది సిబ్బంది ఉన్నప్పటికీ ట్రాఫిక్ సమస్య నియంత్రించే బాధ్యతలు ఎవ్వరికీ పట్టడం లేదు. ఆరేళ్ల క్రితం వరకు బస్టాండు సెంటరు, గాంధీ బొమ్మ సెంటరు, వైఎస్సార్ జంక్షన్, హైస్కూల్ జంక్షన్ల ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా ఒకరో ఇద్దరో పోలీసులు డ్యూటీ చేసే వారు. ప్రస్తుతం పై సెంటర్లలో ఏ ఒక్క సెంటరులో కూడా పోలీసుల జాడ కనిపించడం లేదు. అప్పుడప్పుడు వాహనదారులకు ఫైన్లు వేయడానికి తప్ప, ట్రాఫిక్ సమస్య నివారణకు పోలీసులకు తీరిక ఉండడం లేదనే విమర్శలు ఎక్కువగా ఉన్నాయి. బదిలీపై ఇక్కడకు వచ్చిన సమయంలో సీఐ వీరయ్యగౌడ్ కూడా ఈ ట్రాఫిక్ సమస్యపై స్పందించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. కానీ ఆయన ఇక్కడకు వచ్చిన ఏడాది గడచిందిగానీ సమస్యల తీవ్రత ఏమాత్రం తగ్గలేదు సరికదా మరింత పెరిగింది. ట్రాఫిక్ నియంత్రణ పోలీసు విధులలో ఒక భాగమైనప్పటికీ రాజానగరంలో అది కొరవడడమే ఈ సమస్య తీవ్రతకు ప్రధాన కారణంగా చెప్పవచ్చు. దీనికితోడు రాజకీయ నాయకుల మద్దతుతో గ్రామంలో ప్రధాన రోడ్డుకు ఇరువైపులా పూర్తిగా ఆక్రమణలకు గురికావడం కూడా మరొక కారణంగా ఉంది.

కూడలిలో పోలీస్ ఉంటే చాలు

కూడలి ప్రాంతాలలో ట్రాఫిక్ సమస్యలు సర్వ సాధరణమే. అయితే వాటిని నివారించేలా పోలీసులు డ్యూటీ చేస్తుండాలి. కానీ నియోజకవర్గ కేంద్ర అని పేరేగానీ రాజానగరంలో ఏ కూడలి ప్రాంతంలోను ఒక్క పోలీసు కూడా కనిపించరు. స్టేషనులో మాత్రం సిబ్బంది సంఖ్య భారీగా ఉంటుంది. వాహనదారులపై ఫైన్లు వేయడంలో చూపే శ్రద్ధ ప్రయాణికులకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చేయడంలో చూపడం లేదనేది వాస్తవం.

– మార్గాని కిషోర్‌కుమార్, ఈలకొలను

ఆక్రమణలు పెరిగిపోవడమే కారణం

నియోజకవర్గ కేంద్రంలో అభివృద్ధి లేదు గానీ ఆక్రమణలు మాత్రం పెరిగిపోతున్నాయి. రాజకీయ పెద్దల సపోర్టుతో ఎవరికి వారే ఇష్టానుసారంగా ప్రభుత్వ స్థలాలను సైతం కబ్జా చేసి, షెడ్లు వేస్తుంటే పాలకులు గానీ, అధికారులు గానీ పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉంది. ముందుగా ఈ ఆక్రమణలను నివారిస్తే ట్రాఫిక్ సమస్య చాలా వరకు తీరితుంది.

– పంతం వసంతరావు, కలవచర్ల

బాపనమ్మతల్లిని దర్శించుకున్న ఏఎస్పీ


జిల్లా అడిషనల్ ఎస్పీ సుబ్బరాజును సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

అనపర్తి: రామవరం బాపనమ్మ తల్లిని తూర్పు గోదావరి జిల్లా అదనపు ఎస్పీ ఏవీ సుబ్బరాజు శనివారం దర్శించుకున్నారు. ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా విచ్చేసిన ఆయనను ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభం స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యాక్షుడు మల్లిడి సురేంద్రరెడ్డి, కర్రి వెంకటరెడ్డి, సబ్బెళ్ల సూర్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐదు అడుగులకు మించి వినాయక విగ్రహాలు పెట్టొద్దు


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై రవిచంద్ర కుమార్

బిక్కవోలు: ఐదు అడుగులకు మించి వినాయక విగ్రహాలు పెట్టవద్దని ఎస్సై వాసంశెట్టి రవిచంద్ర కుమార్ తెలిపారు. శనివారం తొస్సిపూడి గ్రామంలో వినాయకుడు ఆలయం వద్ద గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రాబోయే వినాయక చవితి పురస్కరించుకుని ప్రశాంత వాతావరణంలో చవితి వేడుకలు నిర్వహించాలన్నారు. గతంలో జరిగిన అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎటువంటి గొడవలు పెట్టుకోవద్దని, పోలీసులకు సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలోని గ్రామస్తులు పాల్గొన్నారు.

ధర్మకర్తల మండలి పదవికి దరఖాస్తు చేసుకోండి


రాజానగరం: పురాతన చరిత్ర కలిగిన స్థానిక రాజా కాండ్రేగుల జోగిజగన్నాథరావు బహద్దూర్ పంతులు అన్నదాన సత్రానికి పాలక మండలికి ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చని ఎగ్జిక్యూటివ్ అధికారి డి.సురేష్‌బాబు తెలిపారు. రాష్ట్ర దేవదాయ, ధర్మదాయ శాఖ, కమిషనర్ ఇచ్చిన నోటిఫికేషన్ మేరకు శనివారం ఈ ప్రకటనను విడుదల చేశారు. ఆసక్తి ఉన్నవారు 20 రోజుల్లో తమ దరఖాస్తులను జిల్లా దేవదాయ శాఖాధికారి కార్యాలయానికి పంపించాలన్నారు. ఇతర వివరాలకు 9440326258కి ఫోన్ చేయవచ్చన్నారు.

ఘనంగా బాపనమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం


రామవరం బాపనమ్మ ఆలయం వద్ద యాగం నిర్వహిస్తున్న వేద పండితులు

అనపర్తి: వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి, అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సబ్బెళ్ళ కృష్ణారెడ్డి కుమారుడు స్వర్గీయ సురేష్‌రెడ్డి జ్ఞాపకార్థంగా రామవరంలో నిర్మించిన బాపనమ్మ తల్లి ఆలయం ప్రథమ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. సబ్బెళ్ళ తిరపారెడ్డి నాగలక్ష్మి, పడాల సురేష్‌రెడ్డి శ్రీదేవిల దంపతులతో ప్రత్యేక పూజలు జరిగాయి. వేద పండితులు వేదరాజు పవన్ కుమార్ ఆధ్వర్యంలో లక్ష్మీ కమల యాగం నిర్వహించారు. అనంతరం మహన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు, మెజిస్ట్రేట్ జడ్జి నిడమనూరి రామకృష్ణ, రిటైర్డ్ జడ్జి పి.శ్రీనివాస్, రాజమహేంద్రవరం ఏసీబీ డొమ్మేటి వాసు కృష్ణ, ప్రముఖులను ఆలయ కమిటీ తరఫున సబ్బెళ్ల శ్రీనివాసరెడ్డి (బొచ్చు శ్రీను) పలువురు ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామ ప్రముఖులు, ధాత్రి చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు, బాపనమ్మ తల్లి యూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వివరాలిచ్చినా.. బెల్ట్‌షాపులపై చర్యల్లేవేం?


నియోజకవర్గ కో ఆర్డినేటర్ డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: డబ్బులు చేతులు మారకపోతే నియోజకవర్గంలో విచ్చలవిడిగా వెలసిన బెల్టుషాపులపై బీజేపీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సూటిగా ప్రశ్నించారు. శనివారం ఆయన అనపర్తి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మద్యం షాపుల నుంచి అందుతున్న ముడుపుల గురించి తాను మాట్లాడితే బీజేపీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి దానికి సమాధానం చెప్పలేక పెదపూడి మండలానికి చెందిన కొంతమంది మద్యం షాపుల యజమానులతో మాట్లాడించారన్నారు. తాను సూటిగా అవినీతిపై ఎమ్మెల్యేను ప్రశ్నిస్తే దానికి ఆయన సమాధానం చెప్పాలి లేదా మద్యం ముడుపులు తీసుకోకపోతే ప్రజల ధన, ప్రాణాలను హరించి వేస్తున్న బెల్టుషాపులపై చర్యలు ఎందుకు తీసుకోవడంలేదని అన్నారు. ఇప్పటికే పెదపూడి మండలంలో ఎక్కడెక్కడ బెల్టుషాపులు ఉన్నాయో జాబితాను కూడా బహిరంగంగా ఇచ్చామని, అయినా వాటిపై చర్యలు తీసుకోవడంలేదని, నియోజకవర్గంలో బెల్టుషాపులు విచ్చలవిడిగా నడుస్తున్నాయంటే ఎమ్మెల్యేకు తెలియకుండా జరుగుతుందా అని నిలదీశారు. అనపర్తిలో కూడా మద్యం వ్యాపారుల సమావేశం పెట్టి ఎమ్మెల్యే సమాధానం చెప్పాల్సిన పనిలేదని, ప్రతిపక్ష నేతగా జరుగుతున్న అవినీతి వ్యవహారాలపై తాను ప్రశ్నిస్తానని తనకు సమాధానం చెప్పకపోయినా పర్వాలేదు గానీ ప్రజలకు మాత్రం చెప్పాలన్నారు. ముడుపులు తీసుకోకపోతే తరచూ డబుల్ ఇంజన్ సర్కార్ అని చెప్పే ఎమ్మెల్యేగా రామకృష్ణారెడ్డి ఆ బెల్టుషాపులను మూసివేయించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం అనపర్తి మండలంలో అనధికారికంగా నడుస్తున్న బెల్టుషాపుల వివరాలను ఆయన విలేకరులకు అందజేశారు. ఎటువంటి ముడుపులు అందకపోతే కనీసం అధికారులైన ఈ జాబితా ప్రకారం సోదాలు నిర్వహించి అనధికార మద్యం విక్రయాలను కట్టడి చేసి ప్రజల ధన, మాన, ప్రాణాలకు రక్షణ కల్పించాలని డాక్టర్ సూర్యనారాయణరెడ్డి డిమాండ్ చేశారు.

అనపర్తి మండలంలో బెల్టుషాపుల వివరాలు

పీరా రామచంద్రపురం : శివాలయం దగ్గర రేకుల షెడ్డు

దుప్పలపూడి : పంజాబీ ధాబా ముందున్న కిళ్లీ కొట్టు, గాంధీ బొమ్మ దగ్గర పాత బస్టాండ్ పక్కన, బ్రాందీ షాప్‌కి వెళ్లే దారిలో బ్రిడ్జ్ పక్కనే ఉన్న కిళ్లీ కొట్టు.

లక్ష్మీ నరసాపురం : మరిడమ్మ గుడి దగ్గర.

కొప్పవరం : లక్ష్మీనరసాపురం వెళ్లే దారిలో చాకలి పుంత వద్ద ఉంది.

రామవరం : స్మశానం దగ్గర, చాకిరేవు చెరువు వద్ద ఉంది.

పులగుర్త : ఉబ్బలమ్మ చెరువుగట్టు దగ్గర బడ్డీ కొట్టు.

మహేంద్రవాడ : కొప్పవరం రోడ్డులో ముదుగు కాలవ వంతెన దగ్గర ఉంది.

అనపర్తి : వివేకానంద సెంటర్లో ఆంజనేయస్వామి గుడి ఎదురుగా బార్బర్ షాప్ పక్కన, మూసివేసిన రైల్వే గేట్ పక్కన, భాస్కర హోటల్ ఎదురుగా ఉన్న రెండు కిళ్లీ కొట్లు, భారత్ పెట్రోల్ బంకు పక్కన బ్రాందీ షాప్ వెనుక ఉన్న దాబాలో (బ్రాందీ షాప్ మూసివేసేటప్పటి నుంచి తెరిచే వరకు), నల్ల కాలువ వంతెన పైన మెకానిక్ షాప్ పక్కన, చిన్న పాలమూరు టర్నింగ్‌లో పాత బ్రాందీ షాప్ దగ్గర ఉంది.

కుతుకులూరు : పెదపర్తి వెళ్లే దారిలో బ్రిడ్జి దాటాక బడ్డీ కొట్టు, రామవరం చాకిరేవు చెరువు దాటాక కుడి చేతి వైపు ఉన్న బడ్డీకొట్టు.

ఆనందోత్సాహాల మధ్య రాఖీ పండగ


పందలపాకల సోదరులకు రాఖీ కడుతున్న అక్కలు


మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డికి రాఖీ కడుతున్న మహిళా నేతలు

అనపర్తి: రాఖీ పౌర్ణమి సందర్భంగా అనపర్తి నియోజకవర్గ వ్యాప్తంగా అక్కా చెల్లెళ్లు తమ సోదరులకు రక్షాబంధన్ కట్టి రాఖీ పండగను ఆనందోత్సాహల మధ్య ఘనంగా జరుపుకొన్నారు. వివిధ డిజైన్లతో ఉన్న రాఖీలను తమ సోదరుల చేతులు మెరిశాయి. ఆడపడుచులు తమ అన్నదమ్ములకు నుదుట బొట్టు పెట్టి చేతులకు రాఖీ కట్టి స్వీట్సు తినిపించారు. నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో ఉండాలని హారతులు పట్టారు. అనంతరం చెల్లెమ్మలకు, అక్కలకు రాఖీలు కట్టించుకున్న అన్నదమ్ములు బహుమతులు అందజేశారు. ఒకరికొకరు స్వీట్లు తినిపించుకుంటూ ఉత్సాహంగా ఉల్లాసంగా గడిపారు. అలాగే ఉత్సాహం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఘనంగా జరిగింది. నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు ఐ.విజయకుమారి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో అనపర్తి మాజీ శాసనసభ్యులు డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డికి మహిళలు రాఖీ కట్టి సోదర ఆప్యాయతను వ్యక్తం చేశారు. వేడుకల్లో మహిళా నేతలు తేతలి రుక్మిణి, మండా సుజాత, కొత్తపల్లి సత్యవతి, కళావతి, కోటంశెట్టి పద్మావతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బిక్కవోలు: మండలంలో రక్షాబంధన్‌ను వేడుకగా జరుపుకొన్నారు. అక్క చెల్లెళ్లు కట్టిన రాఖీలతో సోదరుల చేతులు మెరిసిపోయాయి. చిన్న పిల్లలతో పాటు పెద్దలు కూడా ఈ పండుగను ఎంతో సంతోషంగా జరుపుకొన్నారు.

శ్రీకృష్ణ చైతన్య ఆశ్రమంలో బలరామ జయంతి

సీటీఆర్‌ఐ: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా స్థానిక ఆర్యాపురం శ్రీకృష్ణ చైతన్య ఆశ్రమంలో శ్రీ త్రిదండి స్వామి భక్తి కంకణ బన మహరాజ్ ఆధ్వర్యంలో బలరామ జయంతిని శనివారం గోపూజతో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆశ్రమ ఇన్‌చార్జి శ్రీపాద హరిదాస బ్రహ్మచారి మాట్లాడుతూ పదో తేదీన భగవద్గీత పోటీలు, 13న సాయంత్రం భరత నాట్య ప్రదర్శన, 14న సాయంత్రం భగవద్గీత పోటీ విజేతలకు బహుమతి ప్రదానం ఉంటుందన్నారు. 16వ తేదీన శ్రీకృష్ణ జన్మాష్టమి మహోత్సవం సాయంత్రం 5 గంటల నుంచి హరి నామ సంకీర్తనం, ఉట్టి కొట్టడం, ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు, గురుపూజ, ప్రవచనం, రాత్రి 11 గంటలకు బాలగోపాలునికి 108 కలశాలతో పంచామృతాభిషేకం, 108 దీపాలతో మహా హారతి, గోదావరి మాతకు హారతి, 56 రకాల రాజభోగ నివేదన, తీర్థ ప్రసాద వితరణ, 17న శ్రీనందోత్సవం ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో గోకుల్ టీవీఎస్ అధినేత ఎస్‌వీవీ సత్యనారాయణ, పీవీఎస్ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ వేడుక.. ఖరీదైన వేదిక..!

- శ్రావణ మాసంలో జోరుగా సాగుతున్న పెళ్లిళ్లు
- మధ్య తరగతి ప్రజలకు తప్పని ధరాఘాతం


పెళ్లి వేడుకకు సిద్ధం చేసిన కల్యాణ మండపం

రాజమహేంద్రవరం రూరల్: శ్రావణ మాసం శుభ కార్యాలకు పెట్టింది పేరు. నెలంతా ముహూర్తాలు ఉండడంతో పెళ్లిళ్ల సందడి మొదలైంది. జంటలు ఒక్కటయ్యేందుకు సిద్ధమయ్యారు. జిల్లా వ్యాప్తంగా పల్లె, పట్టణం తేడా లేకుండా పెళ్లిళ్ల హడావుడి కనిపిస్తోంది. ఊరూరా భాజాభజంత్రీలు మోగుతున్నాయి. పెరిగిన ఖర్చులతో మధ్యతరగతికి భారంగా మారింది. శ్రావణ మాసం ఈ నెల ఆగస్టు 23తో ముగియనుంది. ఈ నెలలో ఇప్పటి ఉన్న ముహూర్తాలతో పాటు రానున్న 10, 11, 13, 14, 15, 17, 18 తేదీల్లో ముహూర్తాలు ముమ్మరంగా ఉన్నాయి. ముఖ్యంగా 13, 14 తేదీల్లో అత్యధికంగా పెళ్లిళ్లు జరగనున్నాయి. దాంతో కల్యాణ మండపాలకు డిమాండ్ పెరిగింది. నగర వ్యాప్తంగా వివాహాలకు సంబంధించి కొనుగోళ్లతో వస్త్ర, బంగారు దుకాణాలలో రద్దీ పెరిగింది. ముహూర్తాలు మొదలు కావడంతో డెకరేషన్, ఫొటోగ్రఫీ, ఈవెంట్లు, క్యాటరింగ్ నిర్వాహకులు తీరిక లేకుండా ఉన్నారు.


పెరిగిన ఖర్చులు

గతంలో వివాహ వేడుకలంటే బ్యాండ్ మేళాలు, భాజాభజంత్రీలు, పూలమండపాలు, వీడియో షూటింగ్‌లు వంటివి చాలా సాధారణంగా ఉండేవి. ప్రస్తుతం ట్రెండ్ మారింది. వివాహ ముహూర్తానికి ముందే సంగీత్ కార్యక్రమాలు, ప్రీవెడ్డింగ్ షూట్లకు ప్రకృతి సోయగాలతో పేరున్న ప్రాంతాలకు వెళ్తున్నారు. కాబోయే వధూవరులతో ప్రత్యేక పాటల రూపకల్పన చేస్తున్నారు. కల్యాణ మంటపంలో ఎల్ఈడీ స్క్రీన్లను ప్రదర్శించడం వంటికి చేస్తున్నారు. సంపన్నులైతే పెళ్లిళ్ల కోసం రూ.లక్షలు ఖర్చుచేస్తున్నారు. సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడిన వారు, వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు చేసేవారు ఖర్చుకు వెనుకాడడం లేదు. అయితే అదే సమయంలో మధ్యతరగతి వర్గాల వారు పెళ్లిళ్ల ఖర్చులతో ఇబ్బందులు పడుతున్నారు.

రూ.30 వేల నుంచి రూ.రెండున్నర లక్షల వరకు..

వరుసగా పెళ్లి ముహూర్తాలు ఉండడంతో కల్యాణ మండపాలకు డిమాండ్ పెరిగింది. మినీ ఫంక్షన్ హాళ్లు, కల్యాణ మండపాలు, కన్వెన్షన్ హాళ్లు, నగర, పరిసర ప్రాంతాల్లో మొత్తంగా 60కు పైగా ఉండగా, వీటితో పాటు ఆలయాల్లో ఉన్న హాల్స్ కూడా బుక్ అయిపోతున్నాయి. ఫంక్షన్ హాళ్ల బట్టి అద్దెలు వసూలు చేస్తున్నారు. మినీఫంక్షన్‌హాల్ అయితే అద్దె రూ.30వేల నుంచి రూ.2లక్షల వరకు ఉంటుంది.ఇవి కాకుండా పూల డెకరేషన్, లైటింగ్, భోజనాల ఖర్చు వంటి వాటితో కలిపి ప్రస్తుతం మినీ ఫంక్షన్ హాల్ రూ.2.50 లక్షలకు పైగా ఉంటోంది. పెద్ద కల్యాణ మండపాలు, కన్వెన్షన్ హాల్స్‌కు పెద్ద మొత్తంలో ఖర్చు అవుతున్నట్టు నిర్వాహకులు చెబుతున్నారు.

డీఏ బకాయిలు మంజూరు చేయండి


భాస్కరరావు

రాజానగరం: పదవీ విరమణ చేసి, పెన్షన్లతో కాలం గడుపుతున్న రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించిన డీఏ బకాయిలను వెంటనే విడుదల చేసి, తమను ఆదుకోవాలని ఏపీఈపీడీసీఎల్ రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరుతోంది. ఈ మేరకు అసోసియేషన్ ప్రతినిధి వై.భాస్కరరావు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రికి రాసిన విజ్ఞప్తి పత్రాలను శనివారం ఇక్కడ మీడియాకు అందజేశారు. 2004–05 సంవత్సరాలలో నాలుగు డీఏ బకాయిలు చెల్లించాలని కోరారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆరు మాసాలకు ఒకసారి డీఏలు విడుదల చేసి, నెల వాయిదాలుగా బకాయిలు చెల్లించేవారన్నారు. గత రెండు సంవత్సరాలలో బకాయి ఉన్న నాలుగు డీఏల విషయమై యూనియన్ పరంగా అడిగినప్పుడల్లా ఉన్నతాధికారుల నుంచి సరైన సమాధానం రాలేదన్నారు. రిటైర్డ్ అయి పెన్షను సొమ్ములతో జీవించే తమ లాంటి బడుగు జీవులను ఈ విధంగా బాధించడం సరికాదన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు డీఏలు ఎంత ముఖ్యమో ఒక కానిస్టేబుల్ కుమారుడిగా ఉపముఖ్యమంత్రికి అవగాహన ఉందని భావిస్తున్నామన్నారు. గతంలో విద్యుత్ శాఖ ఉద్యోగులు, పెన్షనర్స్ పీఆర్సీ బోర్డులో సభ్యులుగా ఉండేవారని, నాలుగు సంవత్సరాలకు ఒక పీఆర్సీ, ఆరు నెలలకు ఒక డీఏ ఇచ్చేవారని గుర్తు చేశారు. తిరిగి ఆ విధానాన్ని తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.